

ఎస్ఆర్‌నగర్‌లో సంబరాల్లో మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన

ఏపీలో టీడీపీ గెలుపు.. నగరంలో సంబరాలు

అమీర్‌పేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలుపొందడంతో ఎస్ఆర్‌నగర్‌లో సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, కరణం అంబిక పార్టీ శ్రేణులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రసూన మాట్లాడుతూ.. టీడీపీకి పూర్వ వైభవం తీసుకువచ్చిన ఏపీ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాక్షస పాలనను అంతమొందించడం ఆనందం కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ కాలనీలో..



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న మోడల్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ వాసులు

ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి విజయం సాధించడంతో మోడల్ కాలనీ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌లో సంబరాలు చేసుకున్నారు. ఫలితాలు వన్‌సైడ్ రావడంతో కాలనీ వాసులు టీడీపీ జెండాలు పట్టుకొని జై చంద్రబాబు, జైజై చంద్రబాబు అనే నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, వీరభద్రరావు, మాచరావు, శశికాంత్, కృష్ణప్రసాద్ మాధవి, శిల్ప, హేమలత, రమణ, సాయి ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

వెంగళరావునగర్‌లో..

పంజాగుట్ట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్, మధురానగర్ తదితర ప్రాంతాల్లో టీడీపీ నాయకులు టపాసులు కాల్చి, పార్టీ జెండాలు పట్టుకుని నృత్యాలు చేశారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. టీడీపీ డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున నాయుడు, నాయకులు వెంకటకృష్ణ, కృష్ణబాబు, ప్రశాంత్, కరీముల్లా, భార్గవ్, రవి, మహేంద్ర, రాఘవ, తదితరులు పాల్గొన్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 1లో సాక్షి కార్యాలయం ఎదుట టీడీపీ నాయకులు టపాసులు కాల్చడానికి యత్నించగా అక్కడ విధుల్లో ఉన్న సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవడంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది.



వెంగళరావునగర్‌లో పార్టీ జెండాలతో టీడీపీ నాయకులు



ఎన్టీఆర్ ట్రస్టు భవన్ వద్ద కేక్ కట్ చేసి విజయ చిహ్నం చూపిస్తున్న టీడీపీ ఖైరతాబాద్ నియోజకవర్గం నాయకుడు బాలాజీ గోస్వామి తదితరులు

- బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి



గురువులను సన్మానిస్తున్న రమణాచారి

కళలకు నిలయం గానసభ

చిక్కడపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): త్యాగరాయగానసభలోని నాలుగు వేదికల్లో కళా ప్రదర్శనలు, పలురంగాలలో ప్రముఖుల చిత్రపటాలు ఆడిటోరియంలో ఏర్పాటుతో గానసభ కళలకు నిలయంగా, కళామయంగా మారిందని ఐఏఎస్ విశ్రాంత అధికారి డా. కేవీ రమణాచారి అన్నారు. ఎందరో మహానుభావుల పేరిట గత కాలపు ప్రఖ్యాతులను స్మరిస్తూ చేస్తున్న కార్యక్రమాలు అద్వితీయమన్నారు. గానసభ వ్యవస్థాపక దినోత్సవం రెండవరోజు కార్యక్రమం మంగళవారం జరిగింది. గానసభ నాట్యగురువు తులసి శిష్యబృందంచే కూచిపూడి నాట్యప్రదర్శన, సంగీత గురువు సుష్మ బృందం గానగోష్ఠి ఆకట్టుకుంది. అధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. గుండవరపు హనుమంతరావు సహకారంతో గానసభ నిర్మాణం జరిగిందన్నారు. తొలిప్రదర్శన గానసభలో ఇచ్చి దేశవిదేశాల్లో ప్రదర్శనలకు వివిధ రంగాల వారు వెళ్లేవారన్నారు. శ్రీనివాస్, ఉష పాల్గొన్నారు.

సైక్లింగ్ ప్రయోజనాలపై అవగాహన

రాయదుర్గం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలో ఎజైకిల్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సైక్లింగ్ ఔత్సాహికులు, వివిధ కమ్యూనిటీ నాయకులతోపాటు విశిష్ట అతిథులను ఒకచోట చేర్చి సైక్లింగ్ వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మిస్టర్ వరల్డ్ సిల్వర్ మెడలిస్ట్ మీర్ మోతేషామ్, ఎజైకిల్ సీఈఓ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోతేషామ్ మాట్లాడుతూ.. తనకు శిక్షణతో పాటు జీవితంలో సైక్లింగ్ ఒక ముఖ్యమైన భాగమన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఆరోగ్యకరమైన జీవనశైలిని, పరిశుభ్రమైన వాతావరణాన్ని ప్రోత్సహిస్తాయని పేర్కొన్నారు.



కార్యక్రమంలో మిస్టర్ వరల్డ్ సిల్వర్ మెడలిస్ట్ మీర్ మోతేషామ్

సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో

కిషన్‌రెడ్డి హవా

- రెండోసారి విజయం సాధించిన బీజేపీ
- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్.. ఖైరతాబాద్‌లో బీజేపీ..
- మొదటి రౌండ్ నుంచే ఆధిక్యత ప్రదర్శించిన అభ్యర్థులు
- మూడో స్థానానికి పరిమితమైన బీఆర్ఎస్

బంజారాహిల్స్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి హవా కొనసాగింది. ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీజేపీ గాలి వీయగా జూబ్లీ హిల్స్‌లో మాత్రం కాంగ్రెస్ ఆధిక్యం ప్రదర్శించింది. అసెంబ్లీ ఎన్నికల్లో రెండింట ప్రభావం చూపించిన బీఆర్ఎస్ ఈ సారి మూడో స్థానానికి పరిమితమైంది. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల కౌంటింగ్ మంగళవారం యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ప్రశాంత వాతావరణంలో జరిగింది. ఉదయం ఎనిమిది గంటలకే కౌంటింగ్ మొదలు పెట్టాల్సి ఉండగా కొంత ఆలస్యం అయినప్పటికీ చివరి రౌండ్ ఫలితాలు సమయానికి విడుదల చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ సొంత నియోజకవర్గమైన ఖైరతాబాద్‌లో పార్టీకి భారీగా మెజారిటీ వస్తుందని అందరూ భావించారు. అయితే దానం పార్టీ మారడాన్ని నియోజకవర్గ ప్రజలు ఆదరించలేదు. కేంద్రంలో మోదీ కోసం మెజారిటీ ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపించారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు భారీగా ఓట్లు పడ్డాయి.

బీజేపీ శ్రేణుల సంబరాలు

కిషన్‌రెడ్డి విజయంతో బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. జూబ్లీహిల్స్ విస్పర్ వ్యాలీలో కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మిఠాయిలు తినిపించారు. అనంతరం బాణాసంచా కాల్చారు. జూబ్లీహిల్స్ డివిజన్‌లో నాయకులు సంబరాల్లో మునిగిపోయారు. యూసుఫ్‌గూడలో బీజేపీ జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి లంకల దీపక్‌రెడ్డి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుంభాల గంగరాజు, ప్రేంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు

ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పోలీసులు కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం చుట్టూ ముడెంచల భద్రత ఏర్పాటు చేశారు. గుర్తింపు కార్డులు ఉన్న ఏజెంట్లను మాత్రమే లోపలికి అనుమతించారు. కొంతమంది కార్డులు లేకుండా వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. సెల్‌ఫోన్‌లను కూడా లోపలికి అనుమతించలేదు. ఈవీఎంలను భద్రపరిచిన చోట, కౌంటింగ్ హాల్‌లో సాయుధులైన భద్రతా సిబ్బంది పహారా కాశారు. మఫ్టీలో ఇంటెలిజెన్స్, ఎస్‌బీ అధికారులు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించారు.

మొదటి రౌండ్ నుంచే..

ఖైరతాబాద్ నియోజకవర్గం ఎన్నికల కౌంటింగ్ ప్రారంభమైన మొదటి రౌండ్ నుంచే బీజేపీ ఆధిక్యత సాధిస్తూ వచ్చింది. మొదటి రౌండ్‌లో 614, రెండవ రౌండ్‌లో 3295 ఓట్ల మెజారిటీ కమలానికి దక్కింది. ఈ రెండు రౌండ్లు హిమాయత్‌నగర్ డివిజన్‌వి కాబట్టి బీజేపీకి ఓటర్లు మొగ్గు చూపించారనుకున్నారు. ఆ తరువాత తెరిచిన ఈవీఎంలలో కూడా బీజేపీ ప్రభావం చూపిస్తూ వచ్చింది. కేవలం 8, 9, 15, 16, 18 రౌండ్‌లలో మాత్రమే కాంగ్రెస్ ప్రభావం కనిపించింది. బీఆర్ఎస్ మాత్రం బీజేపీ, కాంగ్రెస్ దరిదాపులకు కూడా రాలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో మూడో స్థానానికి పరిమితమైన బీజేపీ అనూహ్యంగా పుంజుకొని ఏకంగా 16,540 ఓట్ల మెజారిటీ సాధించింది. గత పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే మెజారిటీ తగ్గిందని బీజేపీ నాయకులు చెబుతున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 19,365 ఓట్ల మెజారిటీ లభించింది. ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొత్తం 1,50,653 మంది ఓటు హక్కు వినియోగించుకోగా బీజేపీకి 73,664, కాంగ్రెస్‌కు 57,124, బీఆర్ఎస్‌కు 16,662, నోటాకు 863 ఓట్లు పోలయ్యాయి.

కాంగ్రెస్ వైపే..

సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ హవా కొనసాగినప్పటికీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మాత్రం కాంగ్రెస్ గాలి వీచింది. తొలి రౌండ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ ఆధిక్యత ప్రదర్శిస్తూ వచ్చారు. 6, 8, 9, 11, 12 రౌండ్‌లలో బీజేపీకి అధిక ఓట్లు వచ్చినప్పటికీ కాంగ్రెస్ మెజారిటీ మీద ప్రభావం చూపించలేకపోయింది. చివరి రౌండ్ ముగిసేసరికి 25,032 మెజారిటీ ఓట్లు కాంగ్రెస్‌కు దక్కాయి. నియోజకవర్గంలో మొత్తం 1,76,466మంది ఓటు హక్కు వినియోగించుకోగా కాంగ్రెస్‌కు 89,705, బీజేపీకి 64,673, బీఆర్ఎస్‌కు 18,405, నోటాకు 820 ఓట్లు వచ్చాయి. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి కేవలం 40 వేల ఓట్లు మాత్రమే వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో 25 వేల ఓట్లతో మూడో స్థానానికి పరిమితమైంది. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లో పుంజుకొని రెండో స్థానానికి చేరింది. బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికల్లో తీవ్ర పరాభవం ఎదురైంది. ఏ స్థాయిలో కూడా కాంగ్రెస్, బీజేపీకి పోటీ ఇవ్వలేకపోయింది. మూడో స్థానంతో సరిపెట్టుకుంది.



సంబరాల్లో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



జూబ్లీహిల్స్‌లో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు



యూసుఫ్‌గూడలో వృద్ధుడికి స్వీటు తినిపిస్తున్న లంకల దీపక్‌రెడ్డి



బేగంపేట కార్యాలయంలో సంబరాల్లో పాల్గొన్న మర్రి శశిధర్‌రెడ్డికి స్వీటు తినిపిస్తున్న పార్టీ నాయకుడు



సికింద్రాబాద్‌లో కిషన్‌రెడ్డి గెలుపొందడంతో టపాకాయలు పేల్చి సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నేతలు

ఆరు నెలల్లో ఎంత మార్పు!

- భారీగా తగ్గిన బీఆర్ఎస్ ఓటు బ్యాంకు

ఖైరతాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన దానం నాగేందర్ గెలుపొందారు. తర్వాత కాంగ్రెస్‌లో చేరి లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసినా ఓటర్లు మాత్రం అంగీకరించలేదు. అసెంబ్లీ ఎన్నికల కంటే బీజేపీకి 35 వేలకు పైగా ఓట్లు అదనంగా రావడంతో బీజేపీ 73,664 ఓట్లతో కాంగ్రెస్‌పై ఆధిక్యం కనబర్చింది.

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు నియోజకవర్గంలో 67,165 ఓట్లు రాగా లోక్‌సభ ఎన్నికల్లో 16,662 ఓట్లు మాత్రమే వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 45,061 ఓట్లు సాధించి రెండవ స్థానంలో నిలవగా, లోక్‌సభ ఎన్నికల్లో 12,063 ఓట్లు అదనంగా పడడంతో రెండవ స్థానానికి పరిమితమయింది.

దానంను తిరస్కరించిన ఖైరతాబాద్ ఓటర్లు

పార్టీలు మారే నాయకులను ప్రజలు నమ్మరని మరోసారి నిరూపితమయింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి 22 వేల ఓట్ల మెజారిటీతో గెలిచిన దానంను లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయగా ప్రజలు అంగీకరించలేదు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు సమాచారం ఇవ్వకుండా కాంగ్రెస్‌లో చేరడంపై ప్రజలు తప్పుగా భావించడం దానం ఓటమికి కారణంగా చెప్పవచ్చు. మైనారిటీలు ఏకపక్షంగా కాంగ్రెస్‌కు ఓటు వేస్తున్నారనే సమాచారంతో చాలా ప్రాంతాల్లో కాంగ్రెస్ శ్రేణులు బీజేపీకి క్రాస్ ఓటింగ్ చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ఓటు బ్యాంకుతోపాటు మైనారిటీల ఓట్లతో సనాయసంగా మెజారిటీ సాధిస్తామని భావించినా.. ఓటర్ల తీర్పు మాత్రం అనూహ్యంగా ఉండడం గమనార్హం.

నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తికి రిమాండ్

పేట్‌బషీరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తిని పేట్‌బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ విజయవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి జయభేరికాలనీ బాలాజీ రెసిడెన్సీ అపార్టుమెంట్‌లో నివసిస్తున్న కెతావత్ సంతోష్(33) నిరుద్యోగులకు ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఒక్కొక్కరి నుంచి రూ.3 నుంచి రూ.6 లక్షలు వసూలు చేశాడు. వీరిని నమ్మించేందుకు నకిలీ హాల్‌టికెట్లు, అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇచ్చి తప్పించుకు తిరుగుతున్నాడు. బాధితులు ఈనెల 1వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంపల్లిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న సంతోష్‌ను మంగళవారం పట్టుకున్నారు. విచారించగా.. ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని 40 మంది నుంచి రూ. కోటి వరకు వసూలు చేసినట్టు అంగీకరించాడు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

పేట్‌బషీరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం అరెస్ట్ చేశారు. అతడి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జీవన్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన బాదుల్లా కరడా మూసాపేట మెట్రోస్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. అతడిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా రెండు కిలోల గంజాయి లభించింది. నిందితుడిని బాలానగర్ ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుభాష్ చంద్ర, ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నగరంలో కనిపించని ట్రాఫిక్

- పలు ప్రాంతాల్లో ఖాళీగా దర్శనమిచ్చిన రోడ్లు
- మాల్స్‌లోనూ తగ్గిన సందడి
- సాయంత్రం తర్వాత కనిపించిన హడావిడి

హైదరాబాద్‌సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం ట్రాఫిక్ హడావిడి పెద్దగా కనిపించలేదు. దేశవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ జరుగుతుండటం.. తెలంగాణతో పాటు ఏపీలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై కొద్దిరోజులుగా ఉత్కంఠగా ఎదురుచూస్తుండటంతో మంగళవారం ప్రజలు టీవీలకు అతుక్కుపోయారు. దాంతో నగరంలో రోడ్లపై పెద్దగా వాహనాల హడావిడి లేదు. ట్రాఫిక్ ఇబ్బందులు కనిపించలేదు. కూడళ్ల వద్ద ట్రాఫిక్‌జామ్ లేకుండా వాహనాలు సాఫీగా సాగిపోయాయి. అత్యవసరం అయితే మాత్రమే రోడ్డుపైకి వచ్చారు. దుకాణాలు, మాల్స్‌లోనూ జనసంచారం పెద్దగా కనిపించకపోవడంతో బోసిపోయాయి. సాయంత్రానికి కౌంటింగ్ ముగిసి ఫలితాలు వెలువడటం పూర్తయిన తర్వాత జనం రోడ్లపైకి వచ్చారు. గెలిచిన అభ్యర్థుల మద్దతుదారులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. దాంతో సాయంత్రం తర్వాత నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ కనిపించింది. మద్యం దుకాణాలు మూసివేయడంతో మందుబాబులు వైన్స్ షాపుల ఎదుట దిగాలుగా కూర్చున్నారు.

అప్పుడే పుట్టిన శిశువు మృతి

- కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్, సీపీఎం నాయకుల నిరసన

చాంద్రాయణగుట్ట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యం కారణంగా అప్పుడే పుట్టిన శిశువు మృతిచెందింది. జంగమ్మెట్ రవీంద్ర నాయక్ నగర్ కాలనీకి చెందిన రాజు కుమార్తె పింకీ మొదటి కాన్పు కావడంతో ప్రసవం కోసం జంగమ్మెట్ ప్రసూతి ఆస్పత్రిలో సోమవారం ఉదయం చేర్పించారు. రాత్రి 8 గంటలకు ప్రసవం చేసిన వైద్యులు చాలాసేపటి వరకు శిశువుకు సంబంధించిన సమాచారం కుటుంబ సభ్యులకు చెప్పలేదు. మగ శిశువు ఆరోగ్యం బాగాలేదంటూ నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. నర్సులు ప్రసవం చేయడంతోనే శిశువు మృతి చెందినట్లు బాధిత కుటుంబ సభ్యులు, సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు ఆస్పత్రి ఎదుట నిరసన చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ. 15.86 లక్షలకు టోకరా

- మనీ ల్యాండరింగ్ పేరిట..
- వృద్ధుడికి సైబర్ నేరగాళ్ల బెదిరింపు

హైదరాబాద్ సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మనీ ల్యాండరింగ్ కేసులో మీ పాత్ర ఉందని సైబర్ నేరగాళ్లు బెదిరింపులకు పాల్పడి ఓ వృద్ధుడి ఖాతా నుంచి రూ. 15.86 లక్షలు కొల్లగొట్టారు. వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్‌కు చెందిన 80 ఏళ్ల వృద్ధుడు రిటైర్డ్ ఉద్యోగి. రెండు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి మీ మీద అంధేరీ పోలీస్‌స్టేషన్‌లో మనీ ల్యాండరింగ్ కేసు నమోదైందని, రాజ్‌కుంద్రా చేసిన రూ. వందలకోట్ల కుంభకోణంలో మీకూ పాత్ర ఉన్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. మీపై ఎఫ్ఐఆర్ నమోదైందని, మనీల్యాండరింగ్ కేసును సీబీఐకి అప్పగిస్తున్నాం.. మీకున్న మొత్తం ఆస్తులతోపాటు మీ భార్య నగలన్నీ జప్తు చేస్తామని బెదిరించారు. కాల్‌ను సైబర్ క్రైమ్ డిపార్టుమెంట్‌కు బదిలీ చేస్తున్నాం అంటూ నమ్మించి మరో వ్యక్తితో మాట్లాడించాడు. మనీ ల్యాండరింగ్ కేసును త్వరలోనే సీబీఐకి అప్పగిస్తున్నాం. ఈ కుంభకోణంలో మీ పాత్ర ఉందో లేదో తేలేవరకు మీ ఆస్తులు, మీ భార్య నగలూ జప్తు చేస్తాం అంటూ సుమారు రెండు గంటలకు పైగా కేసు గురించి వివరిస్తూ వృద్ధుడిని భయభ్రాంతులకు గురిచేశారు. మరుసటిరోజు వీడియోకాల్ చేసిన గుర్తుతెలియని వ్యక్తులు సీబీఐ నుంచి మాట్లాడుతున్నట్లు చెప్పారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీల్యాండరింగ్ కేసులో మిమ్మల్ని అరెస్టు చేస్తామని భయపెట్టారు. మిమ్మల్ని కేసు నుంచి బయట పడేయాలంటే మా ఉన్నతాధికారితో మాట్లాడుకోండి అని నమ్మించారు. కేసునుంచి బయటపడేస్తామంటూ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంకులో దాచుకున్న డబ్బు మొత్తం రూ. 15.86 లక్షలు అతడి నుంచి సైబర్ నేరగాళ్లు కాజేశారు. ఇదంతా ఏదో పెద్ద కుట్రలా ఉందని అనుమానించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు టెక్నికల్ ఆధారాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రదర్శనలో చీరలను పరిశీలిస్తున్న సందర్శకులు

ఆకట్టుకుంటున్న కళా సిల్క్ హస్తకళా చేనేత ప్రదర్శన

బంజారాహిల్స్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అన్ని వస్తువులను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తూ బోరబండ చౌరస్తాలో మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చసిన కళా సిల్క్ హస్తకళా చేనేత ప్రదర్శన మహిళలను ఆకట్టుకుంటుంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేత కారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శన వారం రోజులు కొనసాగుతుందని, ప్రవేశం ఉచితం అని నిర్వాహకులు తెలిపారు.

రేపు వాసా ప్రభావతి పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వాసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీ సాయంత్రం త్యాగరాయగానసభలో వాసా ప్రభావతి పురస్కారాల ప్రదానసభ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు ప్రకాశ్ మీనాక్షి తెలిపారు. చారిత్రక నవలా చక్రవర్తి ముదిగొండ శివప్రసాద్‌కు వాసాప్రభావతి జీవిత సాఫల్య ప్రతిభాపురస్కారం, సాహితీవేత్త కోలవెన్ను మలయవాసినికి గురుదేవోభవ గురుపురస్కారం బహూకరిస్తామన్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలు

మధురానగర్ కాలనీలో వాహనాల తనిఖీ

- 20 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

పంజాగుట్ట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ కాలనీలో పలు ప్రాంతాల్లో పోలీసులు మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. నంబర్ ప్లేట్లు సరిగా లేని, రిజిస్ట్రేషన్ పత్రాలు లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.



ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364

నగరంలో కనిపించని ట్రాఫిక్

- పలు ప్రాంతాల్లో ఖాళీగా దర్శనమిచ్చిన రోడ్లు
- సాయంత్రం తర్వాత కనిపించిన హడావిడి

హైదరాబాద్‌సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం ట్రాఫిక్ హడావిడి పెద్దగా కనిపించలేదు. దేశవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ జరుతుండటం.. తెలంగాణలో పాటు ఏపీ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై గత కొద్దిరోజులుగా ఉత్కంఠగా ఎదురుచూస్తుండటంతో మంగళవారం ప్రజలు టీవీలకు అతుక్కుపోయారు. దాంతో నగరంలోని రోడ్లపై పెద్దగా వాహనాల హడావిడి లేదు. ట్రాఫిక్ ఇబ్బందులు కనిపించలేదు. కూడళ్ల వద్ద ఎలాంటి ట్రాఫిక్‌జామ్ లేకుండా వాహనాలు సాఫీగా సాగిపోయాయి. దుకాణాలు, మాల్స్‌లోనూ జనసంచారం పెద్దగా కనిపించకపోవడంతో బోసిపోయాయి. అయితే, సాయంత్రానికి కౌంటింగ్ ముగిసి ఫలితాలు వెలువడటం పూర్తయిన తర్వాత జనం రోడ్లపైకి వచ్చారు. గెలిచిన అభ్యర్థుల మద్దతు దారులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. దాంతో సాయంత్రం తర్వాత నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ కనిపించింది. మద్యం దుకాణాలు మూసివేయడంతో మందుబాబులు వైన్స్ షాపుల ముందు దిగాలుగా కూర్చున్నారు.

కళలకు నిలయం గానసభ

చిక్కడపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): త్యాగరాయగాన సభలోని నాలుగు వేదికల్లో కళా ప్రదర్శనలు, పలురంగాలలో ప్రముఖుల చిత్రపటాలు ఆడిటోరియంలో ఏర్పాటుతో గానసభ కళలకు నిలయంగా, కళామయంగా మారిందని ఐఏఎస్ విశ్రాంత అధికారి డా. కేవీ రమణాచారి అన్నారు. ఎందరో మహానుభావుల పేరిట గత కాలపు ప్రఖ్యాతులను స్మరిస్తూ చేస్తున్న కార్యక్రమాలు అద్వితీయమన్నారు. గానసభ వ్యవస్థాపక దినోత్సవం రెండవరోజు కార్యక్రమం మంగళవారం జరిగింది. గానసభ నాట్యగురువు తులసి శిష్యబృందంచే కూచిపూడి నాట్యప్రదర్శన, సంగీత గురువు సుష్మ బృందం గానగోష్ఠి ఆకట్టుకుంది. అధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. గుండవరపు హనుమంతరావు సహకారంతో గానసభ నిర్మాణం జరిగిందన్నారు. తొలిప్రదర్శన గానసభలో ఇచ్చి దేశవిదేశాల్లో ప్రదర్శనలకు వివిధ రంగాల వారు వెళ్లేవారన్నారు. శ్రీనివాస్, ఉష పాల్గొన్నారు.

రూ.15.86లక్షలకు టోకరా..

హైదరాబాద్ సిటీ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మనీ ల్యాండరింగ్ కేసులో మీ పాత్ర ఉందని సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు పాల్పడి ఓ వృద్ధుడి ఖాతా నుంచి రూ.15.86లక్షలు కొల్లగొట్టారు. వివరాలిలా ఉన్నాయి.

సికింద్రాబాద్‌కు చెందిన 80ఏళ్ల వృద్ధుడు రిటైర్డ్ ఉద్యోగి. రెండు రోజుల క్రితం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి మీ మీద అంధేరీ పోలీస్‌స్టేషన్‌లో మనీ ల్యాండరింగ్ కేసు నమోదైందని, రాజ్‌కుంద్రా చేసిన రూ. వందలకోట్ల కుంభకోణంలో మీకూ పాత్ర ఉన్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. మీపై ఎఫ్‌ఐఆర్ నమోదైందని, మనీ ల్యాండరింగ్ కేసును సీబీఐకి అప్పగిస్తున్నాం.. మీకున్న మొత్తం ఆస్తులతో పాటు మీ భార్య నగలన్నీ జప్తు చేస్తాం అంటూ బెదిరించారు. ఆ తర్వాత కాల్‌ను సైబర్ క్రైమ్ డిపార్టుమెంట్‌కు బదిలీ చేస్తున్నాం అంటూ నమ్మించి మరో వ్యక్తితో మాట్లాడించాడు. మనీ ల్యాండరింగ్ కేసును త్వరలోనే సీబీఐకి అప్పగిస్తున్నాం. ఈ కుంభకోణంలో మీ పాత్ర ఉందో లేదో తేలేంతవరకు మీ ఆస్తులు, మీ భార్య నగలూ జప్తు చేస్తాం అంటూ సుమారు రెండు గంటలకు పైగా కేసు గురించి వివరిస్తూ వృద్ధుడిని భయభ్రాంతులకు గురిచేశారు. మరుసటిరోజు వీడియోకాల్ చేసిన గుర్తుతెలియని వ్యక్తులు సీబీఐ నుంచి మాట్లాడుతున్నట్లు కలరింగ్ ఇచ్చారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీల్యాండరింగ్ కేసులో మిమ్మల్ని అరెస్టు చేయాల్సి ఉంటుంది అని భయపెట్టారు. మిమ్మల్ని కేసు నుంచి బయట పడేయాలంటే మా ఉన్నతాధికారితో మాట్లాడుకోండి అంటూ నమ్మించారు. అలా బాధితున్ని ముగ్గులోకి దింపిన నేరస్థులు కేసులోంచి బయటపడేస్తామంటూ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంకులో దాచుకున్న డబ్బు అంతా కలిపి మొత్తం రూ. 15.86లక్షలు సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టారు. ఆ తర్వాత ఆలోచనలో పడ్డ బాధితుడు ఇదంతా ఏదో పెద్ద కుట్రలా ఉందని అనుమానించి పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు టెక్నికల్ ఎవిడెన్స్‌ను సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సికింద్రాబాద్‌లో వ్యక్తి అదృశ్యం


సాంబయ్య

అడ్డగుట్ట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నిలోఫర్‌లో చికిత్స పొందుతున్న కొడుకును చూసేందుకు సికింద్రాబాద్‌కు వచ్చిన తండ్రి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి బిర్కూర్ మండలం, వీర్‌పూర్ గ్రామానికి చెందిన పి.సాంబయ్య (32) ఆటో డ్రైవర్. నిలోఫర్ ఆస్పత్రిలో తన కొడుకు అడ్మిట్‌లో ఉండగా చూసేందుకు ఈనెల 1న సికింద్రాబాద్‌కు చేరుకున్నాడు. సికింద్రాబాద్ నుంచి నిలోఫర్ ఆస్పత్రికి రాపిడో బైకు బుక్ చేసుకున్న సాంబయ్య నిలోఫర్ ఆస్పత్రికి చేరుకోకపోవడంతో అతని భార్య సికింద్రాబాద్‌లో గాలించినా ఫలితం లేకపోయింది. అదృశ్యమైన పి.సాంబయ్య సోదరుడు సాంబయ్య గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలించగా రాపిడో బైకు రేతిఫైల్ బస్టాండు వరకు చూపించింది. ఆ తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉందని పోలీసులు తెలిపారు. సాంబయ్య కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ముగ్గురు యువకులు అరెస్ట్

బౌద్ధనగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమంలో అనుచిత పోస్టు చేసి మతకలహాలు సృష్టించేందుకు యత్నించిన ముగ్గురు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇన్‌స్టాగ్రామ్‌లో హైదరాబాదీ జేమ్స్‌బాండ్ పేరిట ఖాతాను తెరిచి మతకలహాలు సృష్టించేవిధంగా ఆడియో క్లిప్పింగ్స్‌తో కూడిన ఓ పోస్టును అప్‌లోడ్ చేసినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. అదే సమయంలో మహ్మద్ ఇనయతుల్లాషరీఫ్ అనే వ్యక్తి సదరు పోస్ట్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఐటీ యాక్ట్ ప్రకారం కేసును నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హైదరాబాద్ జేమ్స్‌బాండ్ పేరిట అకౌంట్‌ను ఏర్పాటుచేసిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా చేసిన నేరం ఒప్పుకున్నారు. అనుచిత క్లిప్పింగ్ పోస్ట్ చేసిన సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని వెస్ట్‌మారేడుపల్లికి చెందిన నోయల్ శోభిత్‌రాజ్(19) అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించటంతో పాటు మరో ఇద్దరు మైనర్లను జువనైల్ హోమ్‌కు తరలించారు. చాకచాక్యంగా వ్యవహరించి కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ అనుదీప్, ఎస్సై బాలరాజు, కిషోర్, క్రైమ్ స్టాఫ్ నవీన్, జగదీష్, వినయ్‌కుమార్, గణేష్‌తో పాటు టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్, ఏసీపీ జైపాల్‌రెడ్డి అభినందించారు.

లష్కర్ ఓటర్లు మరోమారు బీజేపీ వైపు


కిషన్‌రెడ్డిని సత్కరిస్తున్న బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి


పార్శీగుట్ట చౌరస్తాలో సంబురాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

- పోస్టల్ బ్యాలెట్‌తో పాటు అన్ని రౌండ్లలో ఆధిక్యం

బౌద్ధనగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): లష్కర్ ఓటర్లు మరోమారు బీజేపీ వైపు మొగ్గు చూపారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలోని ప్రొఫెసర్ రాంరెడ్డి దూరవిద్యా కేంద్రంలో మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. మధ్యాహ్నం మూడు గంటల వరకు నిర్వహించిన ఓట్ల లెక్కింపు సజావుగా సాగింది. బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి 62,538 ఓట్లు పోలవగా, కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు 44,905 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్‌కు 28,147 ఓట్లు వచ్చాయి. మొదటి రౌండ్ నుంచే బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి ఆధిక్యత కనబరుస్తూ వచ్చారు.

1వ రౌండ్‌లో 75 ఓట్ల లీడ్‌తో ప్రారంభమైన మెజార్టీ 16వ రౌండ్‌కు వచ్చేసరికి 17,633కు చేరింది. మూడో రౌండ్ వరకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ కిషన్‌రెడ్డికి గట్టి పోటీ ఇచ్చారు. సికింద్రాబాద్ నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన పద్మారావుగౌడ్ ఈ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ వస్తుందని ఆశించారు. లష్కర్ ప్రజలు రెండు జాతీయ పార్టీల అభ్యర్థులకు బ్రహ్మరథం పట్టడంతో కౌంటింగ్ హాల్ నుంచి బీఆర్‌ఎస్ ఏజెంట్లు తీవ్ర నిరాశతో వెనుదిరిగారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే బీజేపీ, కాంగ్రెస్ బలం పుంజుకుంది.

రౌండ్	బీజేపీ	కాంగ్రెస్	బీఆర్‌ఎస్
1	2991	2802	2916
2	6896	5087	5596
3	10018	7487	7300
4	14543	11173	9084
5	18658	14345	10646
6	23192	18139	12453
7	27308	20489	14488
8	29292	25428	16140
9	32204	27832	17473
10	36332	30195	19497
11	42009	31512	21148
12	46502	34984	22511
13	52015	38390	24199
14	56181	40296	25280
15	60450	42435	26898
16	62538	44905	28147

నాలుగో స్థానంలో నోటా..

బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల తర్వాత నోటాకు ఎక్కువ ఓట్లు వచ్చాయి. మొత్తం పోలైన ఓట్లలో 851 నోటాకు వచ్చాయి.

బీజేపీ నాయకుల సంబురాలు

బౌద్ధనగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ గడ్డపై మరోసారి కమలం వికసించింది. బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి రెండోసారి గెలుపొందారు. దీంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. టపాసులు కాల్చారు. బీజేపీ ఓబీసీ రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేష్ ఏడు గ్రాముల బంగారంతో తయారు చేయించిన కమలం లోగోను కిషన్‌రెడ్డి జేబుకు పెట్టారు. కొందరు నేతలు కిషన్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు.

సనత్‌నగర్‌లో 32,346 ఓట్ల మెజారిటీ

రెజిమెంటల్‌బజార్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ సనత్‌నగర్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగింది. మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలోని కాలేజ్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ భవనంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో లెక్కింపు జరిగింది. మొదటి స్థానంలో బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి 66849 ఓట్లు, రెండవ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ 34503 ఓట్లు, మూడవ స్థానంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్‌కు 21285 ఓట్లతో నిలిచారు. బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి మొదటి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు 32346 ఓట్ల ఆధిక్యతను సాధించారు. మొత్తం పదిహేడు రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరిగింది. ఒక్కో రౌండ్ లెక్కింపు 15 నుంచి 20 నిముషాల వ్యవధిలో పూర్తిచేశారు. మధ్యాహ్నం 2 గంటలకు లెక్కింపు ముగిసింది. బీజేపీ అభ్యర్థి కిషన్ రెడ్డికి మిగిలిన ఇద్దరు అభ్యర్థులు పోటీ ఇవ్వలేకపోయారు. మొదటి రౌండు నుంచి బీజేపీ అభ్యర్థి ఆధిక్యత స్పష్టంగా కనిపించింది. బీఆర్‌ఎస్ అభ్యర్థికి నామమాత్రంగా ఓట్లు పడ్డాయి. బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి గట్టి పోటీ ఇస్తాడనుకున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ మూడవ స్థానంలో నిలిచారు. మూడవ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి ఉంటాడని అనుకున్నారు కానీ రెండవ స్థానంలో నిలిచాడు.

రౌండ్	కిషన రెడ్డి	దానం నాగేందర్	పద్మారావు గౌడ్
1	5,941	1,656	1,086
2	8,479	5,785	2,292
3	11,434	8,785	3,192
4	17,629	10,076	4,685
5	23,789	11,570	6,718
6	28,343	13,696	8,026
7	32,092	15,604	9,616
8	36,740	17,808	11,466
9	40,842	19,730	13,744
10	44,212	21,375	14,904
11	48341	22,545	15,752
12	52,051	23,842	16,851
13	55,766	25,426	18,133
14	58,526	27,015	19,241
15	61,562	31,100	20,126
16	65,132	33,832	21,127
17	66,849	34,503	21,285

గల్లీలో కాంగ్రెస్ - ఢిల్లీలో బీజేపీ

- కంటోన్మెంట్ ప్రజల విచిత్ర తీర్పు
- అన్ని ప్రధాన పార్టీల్లో క్రాస్ ఓటింగ్

సికింద్రాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టిన కంటోన్మెంట్ ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం బీజేపీకి బ్రహ్మరథం పట్టి విలక్షణ తీర్పునిచ్చారు. అటు మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నిక, ఇటు కంటోన్మెంట్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఉప ఎన్నిక ఏక కాలంలో జరిగిన సంగతి విదితమే. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీగణేష్‌ను 13వేల ఓట్ల తేడాతో గెలిపించిన ప్రజలు.... లోక్‌సభ ఎన్నికల విషయానికి వస్తే బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 19వేలపై చిలుకు ఓట్ల ఆధిక్యత కట్టబెట్టడం విశేషం. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గణేష్‌కు 53,651 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి వంశ తిలక్‌కు 40,445 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదితకు 34,462 ఓట్లు పోలయ్యాయి. మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలో భాగంగా ఉండడంతో కంటోన్మెంట్ ప్రజలు లోక్‌సభ నియోజకవర్గానికి సైతం ఓటు వేయవలసి వచ్చింది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కంటోన్మెంట్ నుంచి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 64,133 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డికి 45,661 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి 17,339 ఓట్లు వచ్చాయి. దీనిని బట్టి అసెంబ్లీకి, లోక్‌సభకు వేర్వేరుగా ప్రజలు తీర్పునిచ్చినట్టయింది. కాగా ఉప ఎన్నికలో బీజేపీకి 40,445 ఓట్లు రాగా, లోక్‌సభ ఎన్నికలో 64,133 ఓట్లు వచ్చాయి. అలాగే ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు 53,651 ఓట్లు రాగా, లోక్‌సభ ఎన్నికలో 45,661 ఓట్లు పోలయ్యాయి. ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ పార్టీకి 34,462 ఓట్లు రాగా, లోక్‌సభ ఎన్నికలో 17,339 ఓట్లు మాత్రమే వచ్చాయి దీనిని బట్టి అన్ని ప్రధాన పార్టీల్లో క్రాస్ ఓటింగ్ భారీగానే జరిగినట్లు తెలుస్తోంది.

తొలి నుంచీ గణేష్‌దే పై 'చేయి'


ఎన్.శ్రీగణేష్

సికింద్రాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎన్.శ్రీగణేష్ గెలుపొందారు. సమీప ప్రత్యర్థి బీజేపీకి చెందిన వంశ తిలక్‌పై ఆయన 13,206 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. 17 రౌండ్లలో మూడు, నాలుగు రౌండ్లు మినహా అన్ని రౌండ్లలో శ్రీగణేష్ ఆధిక్యత ప్రదర్శించారు. తొలి రౌండ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గణేష్‌కు 3,995 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదితకు 3,140 ఓట్లు, బీజేపీ అభ్యర్థి వంశతిలక్‌కు 2,666 ఓట్లు వచ్చాయి. గణేష్‌కు 855 ఓట్ల ఆధిక్యత వచ్చింది. 2వ రౌండ్‌లో గణేష్‌కు 3705 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదితకు 2239 ఓట్లు, బీజేపీ అభ్యర్థి వంశ తిలక్‌కు 1517 ఓట్లు వచ్చాయి. గణేష్‌కు 1466 ఓట్ల ఆధిక్యత వచ్చింది. 3వ రౌండ్‌లో గణేష్‌కు 4344 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదితకు 1731 ఓట్లు, బీజేపీ అభ్యర్థి వంశ తిలక్‌కు 1199 ఓట్లు వచ్చాయి. గణేష్‌కు 2613 ఓట్ల ఆధిక్యత వచ్చింది. 4వ రౌండ్‌లో గణేష్‌కు 2437 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదితకు 2262 ఓట్లు, బీజేపీ అభ్యర్థి వంశ తిలక్‌కు 1920ఓట్లు వచ్చాయి. గణేష్‌కు 175 ఓట్ల ఆధిక్యత వచ్చింది. 5వ రౌండ్‌లో గణేష్‌కు 3655 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదితకు 2367 ఓట్లు, బీజేపీ అభ్యర్థి వంశ తిలక్‌కు 1858 ఓట్లు వచ్చాయి. గణేష్‌కు 1288 ఓట్ల ఆధిక్యత వచ్చింది. 6వ రౌండ్‌లో గణేష్‌కు 3288 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదితకు 2935 ఓట్లు, బీజేపీ అభ్యర్థి వంశ తిలక్‌కు 2575 ఓట్లు వచ్చాయి. గణేష్‌కు 353 ఓట్ల ఆధిక్యత వచ్చింది. 7వ రౌండ్‌లో గణేష్‌కు 2996 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదితకు 2087 ఓట్లు, బీజేపీ అభ్యర్థి వంశ తిలక్‌కు 2977 ఓట్లు వచ్చాయి. గణేష్‌కు 909 ఓట్ల ఆధిక్యత వచ్చింది. 8వ రౌండ్‌లో గణేష్‌కు 2902 ఓట్లు, నివేదితకు 1780 ఓట్లు, వంశ తిలక్‌కు 2612 ఓట్లు వచ్చాయి. గణేష్‌కు 1122 ఓట్ల ఆధిక్యత వచ్చింది.

9వ రౌండ్‌లో గణేష్‌కు 2450 ఓట్లు, నివేదితకు 1558 ఓట్లు, వంశ తిలక్‌కు 2787 ఓట్లు వచ్చాయి. వంశ తిలక్‌కు 337 ఓట్ల ఆధిక్యత వచ్చింది. 10వ రౌండ్‌లో గణేష్‌కు 1890 ఓట్లు, నివేదితకు 1390 ఓట్లు, వంశ తిలక్‌కు 2776 ఓట్లు వచ్చాయి. వంశ తిలక్‌కు 886 ఓట్ల ఆధిక్యత వచ్చింది. 11వ రౌండ్‌లో గణేష్‌కు 3657 ఓట్లు, నివేదితకు 1991 ఓట్లు, వంశ తిలక్‌కు 2711 ఓట్లు వచ్చాయి. గణేష్‌కు 946 ఓట్ల ఆధిక్యత వచ్చింది. 12వ రౌండ్‌లో గణేష్‌కు 3092ఓట్లు, నివేదితకు 1673 ఓట్లు, వంశ తిలక్‌కు 1597 ఓట్లు వచ్చాయి. గణేష్‌కు 1419 ఓట్ల ఆధిక్యత వచ్చింది. 13వ రౌండ్‌లో గణేష్‌కు 3359 ఓట్లు, నివేదితకు 1546 ఓట్లు, వంశ తిలక్‌కు 1736 ఓట్లు వచ్చాయి. గణేష్‌కు 1623 ఓట్ల ఆధిక్యత వచ్చింది. 14వ రౌండ్‌లో గణేష్‌కు 3622 ఓట్లు, నివేదితకు 2164 ఓట్లు, వంశ తిలక్‌కు 2180 ఓట్లు వచ్చాయి. గణేష్‌కు 1442 ఓట్ల ఆధిక్యత వచ్చింది. 15వ రౌండ్‌లో గణేష్‌కు 2962 ఓట్లు, నివేదితకు 1955 ఓట్లు, వంశ తిలక్‌కు 3363 ఓట్లు వచ్చాయి. వంశ తిలక్‌కు 1401 ఓట్ల ఆధిక్యత వచ్చింది. 16వ రౌండ్‌లో గణేష్‌కు 2868 ఓట్లు, నివేదితకు 1966 ఓట్లు, వంశ తిలక్‌కు 3797 ఓట్లు వచ్చాయి. వంశ తిలక్‌కు 929 ఓట్ల ఆధిక్యత వచ్చింది. 17వ రౌండ్‌లో గణేష్‌కు 2962 ఓట్లు, నివేదితకు 1955 ఓట్లు, వంశ తిలక్‌కు 3363 ఓట్లు వచ్చాయి. వంశ తిలక్‌కు 1401 ఓట్ల ఆధిక్యత వచ్చింది. 17వ రౌండ్‌లో గణేష్‌కు 2048 ఓట్లు, నివేదితకు 1437 ఓట్లు, వంశ తిలక్‌కు 1970 ఓట్లు వచ్చాయి. గణేష్‌కు 78 ఓట్ల ఆధిక్యత వచ్చింది.

కంటోన్మెంట్‌ను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసేవరకు పోరాడుతా

కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన శ్రీగణేష్


కౌంటింగ్ కేంద్రం వద్ద ధ్రువీకరణ పత్రాన్ని చూపిస్తున్న శ్రీగణేష్

బోయినపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ సమస్య గల్లీ ప్రాబ్లం కాదు ఢిల్లీతో ముడిపడి ఉందని, కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం చేసేవరకు అవసరమైతే ఢిల్లీలో పోరాడుతానని, ఆమరణ నిరాహారదీక్ష చేస్తానని శ్రీగణేష్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా శ్రీగణేష్ ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం కౌంటింగ్ కేంద్రం వద్ద కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఆయన ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో మల్కాజిగిరి ఎంపీగా సేవలందించిన సీఎం రేవంత్‌రెడ్డికి కంటోన్మెంట్‌పైన పూర్తి అవగాహన ఉందన్నారు. అందుకే తనను గుర్తించి ఉప ఎన్నికల్లో టికెట్ ఇచ్చినందుకు కంటోన్మెంట్ ప్రజలందరూ తనను ఆశీర్వదించి గెలిపించారని అన్నారు. గత పాలకుల అసమర్థత వైఫల్యంతో నియోజకవర్గం వెనుకబడిందన్నారు. మంచినీటి సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చి, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ విజయం కంటోన్మెంట్ ప్రజల విజయమని, కాంగ్రెస్ పార్టీ విజయమని ఆయన పేర్కొన్నారు. తన విజయానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కృష్ణారెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి రఘునందన్‌యాదవ్‌కు, మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. శ్రీగణేష్ గెలుపు వార్త వెలువడగానే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు శ్రీగణేష్ అభిమానులు పెద్ద సంఖ్యలో కౌంటింగ్ కేంద్రానికి చేరుకుని బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

ఫలించిన పొంగులేటి టీమ్ శ్రమ

- దక్కిన కంటోన్మెంట్ ఉప ఎన్నిక ఫలితం


రఘునాథ్ యాదవ్

సికింద్రాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఏకైక ఉప ఎన్నిక జరిగిన సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి టీమ్ శ్రమించిన తీరు ప్రస్తుతం అందరి ప్రశంసలు అందుకుంటోంది. కంటోన్మెంట్ గెలుపు బాధ్యతలను తనకు ముఖ్యమంత్రి అప్పచెప్పడంతో పొంగులేటి తన టీమ్‌తో సహా రంగ ప్రవేశం చేశారు. యువ నేత రఘునాథ్ యాదవ్‌ను ఎన్నికల ఇన్‌చార్జిగా నియమించారు. దాంతో రఘునాథ్ యాదవ్ అటు పొంగులేటికి, ఇటు కంటోన్మెంట్ కాంగ్రెస్ నాయకులకు సమన్వయకర్తగా వ్యవహరించారు. స్థానికంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలను నిశితంగా గమనించి, కేడర్‌తో సంప్రదింపులు జరుపుతూ, ఎన్నికల్లో విజయం కోసం వ్యూహాన్ని రచించారు. గెలుపు కోసం అనుసరించవలసిన తీరును మంత్రి పొంగులేటికి ఎప్పటికప్పుడు చెబుతూ, ఆశీసన సూచనలను పాటిస్తూ, కేడర్‌ను ఉత్తేజపరచారు. కంటోన్మెంట్‌లోని 8 వార్డులకు, మోండ మార్కెట్ డివిజన్‌కు ప్రత్యేక ఇంచార్జిలను సైతం నియమించి, వారంతా రేయింబవళ్లు శ్రమించేలా రఘునాథ్‌యాదవ్ కృషి చేశారు. కాంగ్రెప్ పార్టీ పాత నాయకులను, కొత్తగా పార్టీలో చేరిన వారిని సమానంగా చూసి, వారంతా పార్టీ గెలుపు కోసం సమిష్టిగా పని చేసేలా చొరవ చూపారు.


మెట్టుగూడ టీడీపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న ర్యాల మహేందర్ యాదవ్ తదితరులు


టీడీపీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు గండికోట విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో తార్నాక చౌరస్తాలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు


బౌద్ధనగర్‌లో టీడీపీ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తల సంబురాలు

తెలుగు తమ్ముళ్ల సంబురాలు

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో మహాకూటమి విజయం సాధించడంతో భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు స్థానికంగా స్వీట్లు పంచి సంబురాలు చేసుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జై చంద్రబాబు, జైజై పవన్ కల్యాణ్ అంటూ నినాదాలు చేశారు.

చిలకలగూడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ, టీడీపీ కార్యాలయం వద్ద మంగళవారం కూటమి ఘన విజయం సాధించడంతో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. తెలంగాణ రాష్ట్ర టీడీపీ, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ర్యాల మహేందర్ యాదవ్ పార్టీ జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని, భారీ మెజారిటీతో గెలిపించారని, భాగ్యనగరం అభివృద్ధిలో ఆయన పోషించిన పాత్రను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు, తడక వినోద్‌కుమార్, కార్యకర్తలు ప్రసాద్, మల్లేష్ యాదవ్, నరసింగ్, కృష్ణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తార్నాకలో.. 2024వ సంవత్సరంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ భారీ విజయాన్ని సాధించడాన్ని హర్షిస్తూ టీడీపీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు గండికోట విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం తార్నాక చౌరాస్తాలో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని ఘనంగా సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు గరిగే ప్రవీణ్‌కుమార్, కాతా విజయ్‌కుమార్, తడక వినోద్‌కుమార్, జగదీష్‌గౌడ్, జీఎం రమేష్, హరిబాబు, బొట్టు నరేష్, గండికోట గిరిబాబు పాల్గొన్నారు.

బౌద్ధనగర్‌లో.. ఆంధ్రప్రదేశ్ ప్రజలు మహాకూటమితోపాటు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి పట్టం కట్టారని తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్‌కుమార్ అన్నారు. ఏపీలో మహాకూటమి దూసుకుపోవటంతో ఆయన హర్షం వ్యక్తం చేశారు. వైసీపీకి చెంపపెట్టు పెట్టారని, అపార్టీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా రాలేదన్నారు. వైసీపీపై ప్రజలు ఎంత విరక్తి చెందారో ఆంధ్రప్రదేశ్ ఫలితాలనుబట్టి తెలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేస్తారన్నారు.

టీడీపీ నగర కార్యాలయంలో..

ఏపీలో మహాకూటమి సునామీ సృష్టించి అధికారంలోకి రావడాన్ని స్వాగతిస్తూ దోమలగూడలోని టీడీపీ నగర కార్యాలయంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాలకు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం. అరవింద్‌కుమార్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాణాసంచాలు పేల్చి సంబరాలు జరిపారు. అరవింద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ వైఎస్ జగన్ నియంతృత్వ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని అన్నారు. టీడీపీకి తెలంగాణలో రాబోయే రోజుల్లో పూర్వ వైభవం రావడం ఖాయమన్నారు. వేడుకల్లో నగర ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి. బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు యాదగిరిరావు, చంద్రమోహన్‌గౌడ్, పరుశరామ్, ఎస్. ప్రకాష్, మేడిపల్లి శ్యామ్, విజయ్‌కుమార్, భవానీ శ్రీనివాస్, కట్ట రాములు, వెంకటస్వామి, భిక్షపతిచారి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364